క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్లు



బీఎన్‌కండ్రిగ: వితంతువుకు పింఛను అందజేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హులందరికీ పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఆదివారం కొత్త మంజూరైన వారికి, పాత వారికి పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 2500 లు పింఛనును రూ. 2750లకు పెంచారని తెలిపారు. కంచనపుత్తూరు గ్రామంలో వల్లంటీర్ల 100 శాతం పింఛను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచు స్వప్న, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గురవయ్య, కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధిలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో ఆదివారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి, కాలనీలోని 25 మంది విద్యార్థులకు నూతన దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్, కన్వీనర్ హనుమంతు నాయక్, జస్వంత్, వినోద్, వెంకటరత్నం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత రామచంద్రనాయుడు మృతి

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రామచంద్రనాయుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మూడు దశాబ్దాలుగా మండల రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

చంద్రగిరి : మండలంలోని తొండవాడ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. రామచంద్రాపురం మండలం కనికాపురానికి చెందిన ప్రకాష్ బైక్‌పై తిరుపతి నుంచి చంద్రగిరికి వస్తుండగా మరో బైక్ ఢీకొంది. ప్రకాష్, మరో బైక్‌పై వస్తున్న రోహిత్, అతడి స్నేహితుడు గాయపడ్డారు. వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 16వ తేదీన రథోత్సవం, సాయంత్రం సింహ వాహనం, 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కొండ చుట్టు ఉత్సవం, 18న ఉదయం వసంతోత్సవం, రాత్రి తోటోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



జ్యోతీశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు



వరదయ్యపాళెం: విశేషాలంకరణలో కల్యాణ వెంకన్న





నాగలాపురం మండలం సురుటపల్లిలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తజనం, (ఇన్‌సెట్) బుచ్చినాయుడుకండ్రిగలో వినాయకుడికి పూజ చేస్తున్న పూజారి

వరదయ్యపాళెం: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. వరదయ్యపాళెంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి, త్రయంబకేశ్వరాలయం, పాండూరు సమీపంలోని జ్యోతీశ్వర స్వామి, పెద్ద పాండూరులోని కోదండరామస్వామి, జ్యోతినగర్ కూడలిలోని అభయ ఆంజనేయస్వామి, అరుదూరులోని జ్ఞానప్రసూనాంబిక సమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో యువకులు నూతన సంవత్సర సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి వరకు యువకులు కేరింతలు, డ్యాన్స్‌లతో సందడి చేశారు. అలాగే అర్ధరాత్రి దాటాకా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకులు కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజలు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి, వినాయకుడు, పల్లమాలలోని శ్రీరామ క్షేత్రం, పచ్చాలమ్మ, నీర్పాకోటలోని చెంగాళమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. పల్లమాలలో రంగు ఉప్పుతో వేసిన పచ్చాలమ్మ ప్రతిమ ఆకట్టుకుంది. మండలంలోని 36 చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పిచ్చాటూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నాగలాపురం మండలంలోని వేదనారాయణ స్వామి, సురుటపల్లిలోని శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలాగే పిచ్చాటూరు మండలంలోని రామగిరి వాలీశ్వరాలయం, కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వరాలయం, నీరువాయిలోని నీలకంఠేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేడుకగా నూతన సంవత్సరాది



కల్యాణ వెంకన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



కొత్త సంవత్సర వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ

నారాయణవనం: మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయం, పరాశురేశ్వరస్వామి, అవనాక్షమ్మ, వీరభద్రస్వామి, శక్తి వినాయకస్వామి ఆలయాల్లో వేకువజామున 3 గంటలకు తిరుప్పావై పాసురాలు పారాయణం చేశారు. 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ విజయకుమార్ టీటీడీ ఆలయాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక సారకాయలస్వామి ఆలయంలో శనివారం రాత్రి భజనలు, ఊంజల్ సేవ నిర్వహించారు. కైలాసనాథకోనకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేశారు. రూరల్ సీఐ సురేష్ కుమార్ నేతృత్వంలో ఎస్ఐ పరమేష్‌నాయక్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. పాలమంగళం పాలీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి యువకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు చలిని సైతం లెక్కచేయకుండా ఇళ్ల వద్ద వివిధ రకాల రంగవల్లులు తీర్చిదిద్దారు. మండలంలోని అంజిమేడు పంచాయతీ కృష్ణగిరి కాలనీలో విజయేంద్ర తమ ఇంటి వద్ద ఉప్పుతో జాతీయ జెండాను వేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో..

తిరుపతి: శ్రీకాళహస్తి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు స్వగృహంలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎస్సీవీ యువత షేక్ సాదిక్‌బాషా ఆధ్వర్యంలో ఎస్సీవీనాయుడు కేక్‌కట్ చేసి యువతకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో, దేవదేవుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అలాగే యువత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరారు. వెంకటరత్నం, వహీద్, ఆదిల్‌మస్తాన్ పాల్గొన్నారు.

నేడు పిచ్చాటూరు, నాగలాపురంలలో ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో పర్యటించనున్నట్లు ఎంపీడీఓలు శ్రీనివాసులు, పద్మజ తెలిపారు. ఉదయం 11 గంటలకు పిచ్చాటూరు, 12 గంటలకు నాగలాపురం ఎంపీడీఓ కార్యాలయాలకు ఎమ్మెల్యే చేరుకుని కొత్తగా మంజూరైన పంఛన్లను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం నారాయణవనం మండలంలో పర్యటించనున్నట్టు ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. ప్రభుత్వం పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక రూ 2,750లను ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

పళ్లికొండేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి పళ్లికొండేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కుల్, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. డీఈఓ శేఖర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాల పద్మనాభం, నాయకులు చెంగల్రాయరెడ్డి, కిరణ్ కుమార్, బాబు రెడ్డి, వజ్రవేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే బియ్యపు మధుసదన్‌రెడ్డిని సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఘనంగా సన్మానించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సాధన మున్నా, బుల్లెట్ జయశ్యామ్, పసల సుమతి, రమాప్రభ, కొండూరు సునీత, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, నాయకులు నంద, లక్ష్మీపతి, భాస్కర్, పాలమంగలం రవి, కొల్లూరు హరినాయుడు, కంఠా ఉదయ్, సురేష్, వేదపండితులు అర్ధగిరి, శ్రీనివాస వర్మ, హేమంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలు



కుమార్తెకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రేణిగుంటలోపవిత్రారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య



పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తిరుపతి: శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్‌చేసి అభిమానులు, నాయకులకు పంచిపెట్టారు. పలువురు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రారెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

రేణిగుంటలో..

రేణిగుంట: వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం రేణిగుంట మండలంలో ఘనంగా జరిగాయి. రేణిగుంట పట్టణ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు ఆమెతో భారీ కేక్ కట్ చేయించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి, జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు సుభాన్‌రాజ, ఖదీర్ నేతృత్వంలో మత పెద్దలు ప్రార్థనలు చేసి, ఆమెకు ఆశీర్వచనాలు అందించారు. తనను తొలి నుంచి ఇంటిబిడ్డగా ఆదరిస్తున్న రేణిగుంట మండల ప్రజలు, పార్టీ శ్రేణుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్‌లు గంగారి రమేష్, నగేషం, ముద్దురాయలు, మునిశేఖర్‌రెడ్డి, నాయకులు రహీం, యోగేశ్వర రెడ్డి, శంకర్‌రెడ్డి, నగరి కృష్ణ, సాయి, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, శశికిరణ్, రహంతుల్లా, ఇర్ఫాన్ తదితరులు ఆమెను ఘనంగా సత్కరించారు.

తారకరామానగర్‌లో...

మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో మన్యం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఆమెను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. 200 మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కన్నయ్య, రాజేష్‌రాయల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో చీరలు పంపిణీ

పాంచాలినగర్‌లోని అపోస్తలిక్ క్రిస్టియన్ చర్చి, రాజరాజేశ్వరి నగర్ హర్మోను ప్రార్థనా మందిరం, జ్యోతినగర్‌లోని జెరూసలెం ప్రార్థన మందిరంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలను పంపిణీ చేశారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం





ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

ఏర్పేడు: మండలంలోని వికృతమాల సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరిగే వైకుంఠ ఏకాదశికి ఆదివారం ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. ఆలయం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, అరటి చెట్లు కట్టారు. ఆలయంలో బెంగళూరు, చెన్నై తదితర పట్టణాల నుంచి తెచ్చిన వివిధ రకాల పుష్పాలు, పండ్లు, కూరగాయలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలు, వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, ముత్యాలనాయుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఎల్లంపల్లి శ్రీనివాస్, మేడా మల్లికార్జున రెడ్డి, పెద్దారెడ్డి, వాసుపల్లి గణేష్, టీటీడీ మాజీ జేఈఓ శ్రీనివాసరాజు, తమిళనాడు మంత్రి ఆర్.గాంధీ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని ఆదివారం తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దర్శించుకున్నారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రికి బీజేపీ నేతల స్వాగతం



రేణిగుంట విమానాశ్రయంలో మహారాష్ట్ర సీఎంకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

రేణిగుంట: మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన నేత ఏక్‌నాథ్ షియాజీ షిండేకు ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల దర్శనార్థం ఆదివారం రాత్రి ఇక్కడకు చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, భానుప్రకాష్‌రెడ్డి, బీడీ బాలాజీ తదితరులు ఘనస్వాగతం పలికారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన ప్లకార్డును ప్రదర్శించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

భావితరాలకు ఆధ్యాత్మిక సంపద అందించాలి

- టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు రాజ్‌కుమార్
- అక్కుర్తి గ్రామంలో గోపూజ



గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి రూరల్: మన ఆధ్యాత్మిక సంపదను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు పోతుల రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అక్కుర్తి గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో గోపూజ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని, గోపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మానవులు సర్వతోముఖాభివృద్ధికి భక్తి మార్గమే ఏకైక మార్గమని చెప్పారు. హైందవ ధర్మంలో దేవాలయాలు మానవతా వికాస కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయని చెప్పారు. దేవాలయాల ద్వారా ఆధ్యాత్మికం, జ్ఞానం, విద్య, సాంస్కృతిక చైతనం పెంపొందుతాయని చెప్పారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు పరశురామ్



ధ్వజస్తంభం వద్ద సినీ దర్శకుడు పరశురామ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం గీతగోవిందం, సర్కారువారి పాట దర్శకులు పరశురామ్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే నాగచైతన్యతో ఓ చిత్రాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, శశి, సురేష్, పార్థ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్‌తో మురిసెన్



పాపానాయుడుపేటలో పెన్షన్ నగదును అందజేస్తున్న సర్పంచ్ లలిత



నారాయణవనంలో పింఛను అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు



పంగూరులో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

ఏర్పేడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పెన్షన్ నగదుతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వేకువజాము నుంచి వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాల్లో లబ్ధిదారుల తలుపు తట్టి ఆయా పంచాయతీల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బయోమెట్రిక్ ద్వారా వారి వేలిముద్రలను సేకరించి, అందజేశారు. మండలంలోని పంగూరులో ఆదివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

112 కొత్త పింఛన్లు మంజూరు

పిచ్చాటూరు: మండలానికి 112 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. జనవరి ఒకటవ తేదీ కావడంతో పెరిగిన రూ.2750లను పింఛనును వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

పండుగ వాతారణంలో పింఛన్ల పంపిణీ

నారాయణవనం: మండలంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు వేకువ జామున నుంచే పెన్షన్ కానుక పంపిణీ చేసినట్టు ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. మండలంలో 5,930 మంది లబ్ధిదారులకు రూ.1,47,99,000లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కొత్తగా 157 మందికి వైఎస్సార్ కానుక పెన్షన్ మంజూరైందని తెలిపారు. వివిధ కారణాలతో 49 మందికి నోటీసులను జారీ చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అర్హత ఉన్న వారికి పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.